**–పుష్యమి కథ**

## ఎప్పటిలాగే ఆరోజు ఉదయం కూడా డాబా మీద పచార్లు చేస్తూ, ఆ యింటివైపు చూశాను.

**అప్పటికే ఆమె లేచి, పనులు చేసుకుంటోంది. భర్తని ఆఫీసుకి, పిల్లల్ని స్కూల్‌కి పంపే హడావుడిలో వుంది.**

**మేడమీద నుంచి చూస్తే వారుండే పోర్షన్ కనబడుతోంది. ఇంట్లో వుండగా ఆమె నాకంటబడదు. పెరట్లోకి వస్తే ఆమె చాలా స్పష్టంగా కనబడుతుంది.**

సాధారణంగా నాలాంటి బ్రహ్మచారి కుర్రాళ్ళకు ఆమెలాంటి అందగత్తెల్ని చూస్తే కోరిక కవ్వింపు కలుగుతుందట! కాని నాకు మాత్రం అలాంటి కాంక్ష కన్నా ఓ విచిత్రమైన ఆహ్లాదానుభూతి కలుగుతుంది.

ఆమె మంచి అందగత్తె. అవయవాలన్నీ ఆమెలో కొన్నిచోట్ల గర్వంతో, మరికొన్ని చోట్ల సిగ్గుతోనూ అందమైన మలుపులు తిరిగాయి. ఒంపులు చాలాసార్లు వంకర ఆలోచనలు కలిగిస్తుంటాయి.

కాని ఆమెకి పెళ్ళయ్యింది అనే నిజం చెర్నాకోలలా నా వక్రబుద్ధిని ఛెళ్‌మని చరిచి, సరి చేస్తుంటుంది.

కాంక్ష-ఆరాధన చూడటానికి ఒకేలా కన్పించినా, ఆ రెండింటి మధ్య సన్నటి సరిహద్దు వుంది.

ఆ హద్దులోనే వుండి ఆమెని ఆరాధిస్తున్నాను. ఆమెని గమనిస్తుండటం నాకు యిష్టం. ఆమె నవ్వు బుగ్గల వరకూ అలలు అలలుగా తేలడం, ప్రతి కదలిక ఓ మెరుపు కాంతిలా తళుక్కుమనడం..ఇవన్నీ గమనిస్తుండటం నాకు హాబీ అయ్యింది.

అంతకు మించి ముందుకుపోవాలని, పోగలనని నేనేనాడూ అనుకోలేదు.

పొరుగింటివాడిగా అతి కొద్దిసార్లు మాత్రమే ఆమెతో మాట్లాడాను.

ఆమె భర్త నా కొలీగ్ కావడం ఓ కాకతాళీయం! అందువల్ల అరుదుగానయినా ఆమె సామీప్యంలో వుండే అవకాశం నాకు దొరికింది.

ఒకోసారి ఆమె అవివాహితగా పరిచయమైవుంటే ఎంత బాగుండేదా అన్పించేది.

జ్వలింపజేసే ఆ సౌందర్యాన్ని నాలో పొదుముకుని, ఆ కాంక్షాజ్వాలలకు నాలో నేను దగ్ధమైపోతున్నా, నా జీవితపు వెలుగుగా ఆ సౌందర్యరాశిని ఆరాధిస్తూ, జీవితాంతం గడిపేయా లన్పించేది.

చాలాసార్లు..నా ప్రేమ భావాన్ని నా నుంచి తొలగించి, ఓ మిత్రుడి భార్యగా మాత్రమే గౌరవించాలనుకునే వాణ్ణి.

ఆ గౌరవం నన్ను ఆమె పరువపు గడప యివతల నిలబెట్టింది తప్పితే, నా వాంఛని తుంచలేకపోయింది.

★ ★ ★

''ఎక్స్‌క్యూజ్ మీ సార్, ఈరోజు నాకు వంట్లో బాగుండలేదు. రాలేను ఆఫీసుకి. లీవ్ కావాలి!'' ఫోన్‌లో చెప్పాను మా బాస్‌తో.

''సెలవు తప్పదా!''

''తప్పనప్పుడే కదా సార్!''

''సరే..రేపు వస్తున్నావుగా!'' అని హామీ తీసుకుని ఫోన్ పెట్టేశాడు మా బాస్.

సిగరెట్ వెలిగించాను-బూత్ నుంచి బయటికి వచ్చేసి.

నిజానికి బాగుండనది శరీరం కాదు-మనసు. మళ్ళీ మనసు చెదిరిపోయింది ఆమెను చూస్తే.

ఆరోజు అంత అందంగా అలంకరించుకుంది. ఇస్త్రీ చేసిన గులాబీరంగు కాటన్ చీర కట్టుకుంది. మోచేతుల వరకూ రవిక, ఒక చేతికి రిస్ట్ వాచీ, మరో చేతికి రెండే రెండు గాజులు...

పోనీ టెయిల్ వేసుకుంది-కావ్యనాయికలా ఆమెకి బారెడు కురులు లేవు.

జాకెట్ షేప్ వల్ల వీపు కనబడకుండా వుండేందుకు నిలబడిన కాపలాదారుడిలా వుంటుంది ఆమె జుట్టు.

సాధారణంగా పూలు పెట్టుకోవడమంటే యిష్టం వుండదట ఆమెకు. అందరికీ సువాసన కలిగించే సన్నజాజుల, విరజాజుల పరిమళం ఆమెకి సుతరామూ గిట్టదట!

ఎప్పుడయినా కనికరిస్తే ఓ మల్లెచెండుకి తన జడలో చోటిస్తుంది ఆమె.

> **నా** కళ్ళముందు ఓ చీకటి దృశ్యం మెదులుతోంది.
> రెండు జతల చేతులు ఎక్కడెక్కడో అన్వేషిస్తున్నాయి.
> పల్కరించుకుంటున్నాయి.
> మృదుత్వం భగ్గుమని మండే అగ్గి అయ్యింది.

దానికో చిన్న కథ చెప్పాడు ఆమె భర్త (వురఫ్ నా కొలీగ్) ''మా ఆవిడకి చాలా సిగ్గయ్యా బాబూ! ఎప్పుడయినా నేను యింట్లో వున్నప్పుడు, నేను స్వయంగా తీసుకొచ్చి, యిస్తే, అదీ రాత్రివేళల మాత్రమే మల్లెపూలు పెట్టుకుంటుంది'' అన్నాడు.

తన భార్య ప్రవర్తన గురించి అతను చాలా సందర్భాల్లో గర్వంగా చెబుతుంటాడు.

ఆ ఉదయం మాత్రం ఎందుకో ఒకే ఒక్క ఎర్రగులాబీకి తన జడలో స్థానం కల్పించింది.

ఎప్పుడో చదివిన ఓ మినీ కవిత గుర్తొచ్చింది- ''నీ జడలో ఒంటరి గులాబీ-జంట లేక విలపించే నాలా''-

ఆ కవివాక్కు ఆ క్షణాన నాకు అన్వయించుకుంటే అక్షర సత్యం అన్పించింది.

వయసు మూడుపదులు దాటినా ఆమె అందం ఓ పదేళ్ళ వెనక నిలిచిపోయినట్లన్పిస్తుంది.

అందుకే మళ్ళీ కలలు చెరిగిపోయి, మనసు వి'కల'మైంది.

లాభం లేదు-వీలయినంత త్వరగా ఈ రూమ్ నుంచి, ఆమె సౌందర్య ఛాయలు పడని చోటుకి వెళ్ళిపోవాలనుకుని, ఆక్షణమే నిర్ణయం తీసుకున్నాను.

కానీ ఆమె భర్త ఏదో సందర్భంలో ఆమె గురించి ప్రస్తావిస్తుంటాడు. విని, ఊహల లోయలోకి కూలిపోకుండా నేను వుండగలనా?

కనీసం ఎంతమేరకు బయటపడితే అంత మంచిది!

సెలవుపెట్టి రూమ్‌లో కూర్చున్నాను. ఏమీ తోచదు. పుస్తకాలు చూడబుద్దెయ్యదు. టేప్ రికార్డర్ పాటలతో జోకొట్టాలని చూస్తుంటే దాని పీక నొక్కేయాలన్పిస్తుంది. లేదంటే-కిటికీ తెరచి, ఆమె యింటికేసి చూడాలన్పించసాగింది.

మళ్ళీ అదే బలహీనత..గుండె తలుపు పదే పదే తట్టసాగింది.

రూమ్‌కి తాళం వేసి, మధ్యాహ్నం ఆట సినిమాకు బయల్దేరాను.

పాత సినిమా-నూన్ షో- జనం పలచగా వున్నారు. బాల్కనీ అయితే మరీ దారుణం-యాభైమంది కూడా వుండరు.

ఓ మూలన కూర్చున్నాను-సీటుకి జారగిలబడ్డాను. ధ్యాస సినిమా మీద లేదు. ఎక్కడెక్కడో పరిభ్రమిస్తోంది.

నా ఏకాంతధ్యానాన్ని భగ్నం చేస్తూ, చిన్నగా గాజుల చప్పుడు ఎక్కడో వెనక నుంచి...

''ఉష్! ఏంటది?''

''ఇన్నాళ్ళూ తెలియదా ఈ అల్లరి''? ఓ మగగొంతు.

''అల్లరి చేయడానికి వచ్చింది సినిమాకి?''

''సరే..నువ్వు సినిమా చూడు! నేను నాక్కావలసింది చూస్తాను'' నవ్వు...

''ఛీ!''

''ఏంటి ఛీ! నిన్ను చూస్తుంటే చాలు, నాకు వేరే లోకం అక్కర్లేదు..''

లోగొంతుకతో కూడిన ఆ సంభాషణ వింటుంటే తెలిసిపోయింది ఏదో ప్రేమ జంట..మ్యాట్నీ షోలలోనూ, పార్కుల్లోనూ, ఐస్‌క్రీమ్ పార్లర్లలోనో కలుసుకునే ఓ సగటు జంట...

# గుప్పిట్లో రహస్యం



''నిజం రా! నువ్వు లేట్‌గా పరిచయమయ్యావు-ఈలోగా తొందరపడి పెళ్ళి చేసుకున్నాను. దానివల్ల ఒక్కరోజూ సుఖం లేదు. ఎప్పుడూ కడుపు నొప్పి అని ఏడుస్తుంటుంది. దానికి తోడు షుగర్ కంప్లయింట్ ఒకటి-ఏదో నువ్వు దగ్గరుంటేనే సుఖం-''

''నాకూ అంతే! మా ఆయన, వాడి బాన పొట్ట, ముసలాడిలా నెరిసిపోయిన జుట్టు, వాడూ చేసే అప్పులంటే నాకు చాలా అసహ్యం.

ఏమిటో-మన యిష్టాయిష్టాలు తెలియని వయసులో పెళ్ళి చేసేస్తారు. నువ్వుగాని మాపెళ్ళికి వచ్చివుంటే పెళ్ళిపీటల నుంచే నీతో లేచి పోయేదాన్ని...''

ఒకటే నవ్వులు విరగబడి-

హఠాత్తుగా ముద్దుపెట్టుకున్న చిన్నపాటి ధ్వని...

నాకళ్ళముందు ఓ చీకటి దృశ్యం మెదులుతోంది. రెండు జతల చేతులు ఎక్కడెక్కడో అన్వేషిస్తున్నాయి. పల్కరించుకుంటున్నాయి. మృదుత్వం భగ్గుమని మండే అగ్గి అయ్యింది. ఆ అగ్నిశిఖలో నాకెక్కడో తెలిసిన స్వరాల రాగం...

''నిజం! మిమ్మల్ని వదిలి వుండలేను! మీ యింటి పక్కన పోర్షన్ ఖాళీ వుంటే చూడండి. మా ఆయనకి ఎలాగో నచ్చచెప్పి, మీ యింటికి దగ్గరగా వచ్చేస్తాం.

ఇక మీకింత ఆరాటం, అవస్థ వుండదు. మీకు ఎప్పుడు కావాలంటే అప్పుడే...'అంటూ 'ఊ'అని మూలిగిందామె.

నా గొంతెవరో నొక్కేసినట్లయ్యింది.

''అమ్మో! మా ఆవిడకి తెలిస్తే చంపేస్తుంది'' అంటున్నాడతడు.

'' మీ ఆవిడకి అనుమానం రానంతగా నేను దగ్గరవుతానుగా ఏదో వరస కలిపేసి...''

ఇక ఆ తర్వాత మాటలు మౌనం దాల్చాయి. ఓ అక్రమ అనుబంధం రహస్య ఏకాంతంలో విశ్వాకృతి దాలుస్తున్న నిట్టూర్పులు..నా చెవికి సోకాయి.

ఓ గంట తర్వాత ఇంటర్వెల్ అయింది. బయటికి వెళ్దామని లేచాను. యధాలాపంగా ఆమూాల సీటు వైపు చూశాను.

మనసు చెదిరిపోయింది-మామూలుగా కాదు, ఇంకోసారి చెదిరిపోయేందుకు మనసే లేనంతగా-

ఎందుకంటే..'ఆమె' 'ఆమే'కాబట్టి! నా కొలీగ్ భార్య, గౌరవనీయురాలైన మా ఎదురింటావిడ-అన్నింటికి మించి నా పవిత్రమైన ఆరాధనని క్షణమాత్రంలో తునాతునకలు చేసిన అతిసాధారణమైన స్త్రీ కాబట్టి-

ఆమె నన్ను చూసింది.

షాక్ అయిందా? భయపడిందా? తేలికగా తీసుకుందా? ఏమో, ఎవరికి తెలుసు?!

★ ★ ★

ఇప్పుడేం చేయాలి?

ఆమె అంటే నాలో నాకు తెలియని యిష్టంతో పాటు ఓ గౌరవం వుంది! అది కాస్తా పోయింది.

''తప్పుదారిన పడొద్దు! పడిన అడుగు వెనక్కి తీసుకో! నీ భర్తతో హాయిగా జీవితం సాగించు''అని చెప్పాలా?

చెప్పేంతటి చనువు నాకు, స్వీకరించేంతటి సహృదయత ఆమెలో వుందా?

నీ సలహా ఆమె మరోలా స్వీకరిస్తే...

'నీ రహస్యం నాకు తెలుసు' అని నేను ఇన్‌డైరెక్ట్‌గా బ్లాక్ మెయిల్ చేసినట్లు ఆ సలహాని అర్థం చేసుకుంటే...?

అంతకన్నా అగౌరవం నాకు మరొకటి వుండదు!

మరి-

ఆలోచన నన్ను దొలిచేస్తోంది.

ఇకవారి అన్యోన్యత జీవితాంతం వుండాలంటే...

వారు ఆమె ప్రియుడి నీడ నుంచి దూరంగా వెళ్ళిపోవాలి!

ఆమె భర్తకు చెబితే...?

అతనికి భార్య అంటే వెర్రి ప్రేమ! ఆమెని ప్రేమించడం తప్పితే, ద్వేషించడం తెలియని వ్యక్తి అతను!

మానవ బలహీనతలను అర్థం చేసుకునే క్షమాగుణం అతనిలో వున్నట్లు నాకున్న కొద్దిపాటి పరిచయంతో తెలుసు!

ఆ కుటుంబాన్ని అభిమానించే ఆరాధకుడిగా నిజం చెప్పక తప్పదు!

అతణ్ణే కలిశాను-మాటల మధ్యలో ప్రస్తావించాను. ''ఆమెగారు నిన్న సినిమా హాల్‌లో కనబడ్డారు. కూడా ఎవడో వున్నాడు.

చాంచల్యాలు, ఆకర్షణలు, వాంఛలు-క్షణిక వ్యామోహాలు! నువ్వు ఆమెని క్షమించు! క్షమించగలవని నాకు తెలుసు.

దూరంగా వెళ్ళిపోండి - హాయిగా వుండండి!ఎక్కువ చనువు తీసుకున్నందుకు నన్ను మన్నించు!'' అన్నాను.

అతని ముఖం ఒక్కక్షణం మ్లానమైంది. ఆవేదనే తప్ప ఆవేశం కనబడలేదతనిలో...

ఆ మరుసటిరోజు ఉదయం అతను ఆత్మహత్య చేసుకున్నాడు.

నిజం చెప్పి పొరబాటు చేశానే అనే బాధ నాలో విషాదాన్ని మిగిల్చింది.

రెండోరోజు నాకు పోస్ట్‌లో ఉత్తరం వచ్చింది. నాకు తెలియని చేతిరాత-చివరన పేరునిబట్టి అతనిదే అని తెలిసింది.

''డియర్ ఫ్రెండ్-

సెక్స్ జీవితంలో అత్యవసరమైన ఆనందం! 'అతి'కి మనం కొన్ని హద్దులు విధించుకున్నాం. కొంతమంది అసంతృప్తి, ఆర్థిక యిబ్బందులు లేకపోయినా ఏ థ్రిల్‌కో లొంగిపోతారు. అలాంటిదే నాభార్య!

నాకూ వెంటనే కాకపోయినా కొద్దిరోజుల తర్వాత తెలిసింది- ఈ విషం లాంటి నిజం!

బట్, గరళాన్ని దిగమింగాను- నా భార్య మీద నాకున్న అతిప్రేమో, విడిపోతే పరువుపోతుందన్న భయమో....కారణమేదయినా కానీ సహించాను.

ఇది ఇంకొకరికి తెలిసింది అనుకున్నాక భరించడానికి చాలా అసమర్థత కావాలి. చాలా కాలం నుంచి నా అసమర్థతని మెచ్చించడం వల్ల ఇంకా నా దగ్గర ఆ క్వాలిఫికేషన్ లేదు.

నువ్వో నిమిత్తమాత్రుడివి. గిల్టీ ఫీలయ్యింది నేను. కుమిలిపోవలసింది నువ్వు కాదు.

ఎలా సెలవు తీసుకోను? బై- గుడ్‌బై ఫరెవర్!''

నా చేతుల్లో ఉత్తరం నలిగిపోతోంది- ఆక్షణాన నా మనసులా.

★